
సాక్షి
బాపట్ల
ఆదివారం ; 21 ; జూలై ; 2024



కలెక్టర్ ప్రత్యేక పూజలు

బాపట్ల: పట్టణంలోని శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయాన్ని కలెక్టర్ జె.వెంకట మురళి శనివారం సందర్శించారు. స్వామికి పూజలు చేసి, ఆలయ చరిత్రను తెలుసుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



నత్తైనపల్లి: వడ్డవల్లి రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు బూరుగులమ్మ శాకంబరి ఉత్సవాలు



రేపల్లె రూరల్: ఆషాఢ మాసం శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లో గల గ్రామదేవత శ్రీ బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో శాకంబరి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్ తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు కూరగాయలతో అలంకరించనున్నట్లు చెప్పారు. కూరగాయలు సమర్పించదలచిన భక్తులు ఆదివారం ఉదయం ఆలయంలో అందించాలని ఆయన కోరారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

రెంటచింతలలో భారీ చోరీ

రూ. లక్ష నగదు, 92 గ్రాముల బంగారం అపహరణ



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో శుక్రవారం రాత్రి భారీ చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని జెండాచెట్టు సమీపంలోని ఏరువ ప్రతాప్‌రెడ్డి ఈ నెల 19 శుక్రవారం ఉదయం 6.30 గంటలకు తెలంగాణ రాష్ట్రం హన్మకొండ పట్టణంలో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి కుటుంబ సమేతంగా వెళ్లారు. శనివారం మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో ఇంటి పక్కన వారు తలుపులు తీసి ఉండటం గమనించి విషయాన్ని ప్రతాప్‌రెడ్డికి తెలిపారు. రాత్రి 7 గంటల సమయంలో వచ్చిన ప్రతాప్‌రెడ్డి ఇంట్లోని రెండు బీరువాలను పగలగొట్టి నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గమనించి వెంటనే పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. ఘటనా స్థలానికి ఎస్ఐ ఎం.ఆంజనేయులు, ఏఎస్ఐ హనుమంతరావు వెంటనే చేరుకుని ఆ ఇంటి చుట్టుపక్కల వారిని విచారించి, వివరాలను సేకరించారు. అనంతరం బ్రహ్మయ్య బావి సెంటర్‌లో ఏర్పాటు చేసిన పలు సీసీ కెమెరాలను పరిశీలించారు. రూ. లక్ష నగదు, సుమారు రూ. 6.30 లక్షల విలువైన 92 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గుంటూరు నుంచి క్లూస్ టీంను పిలిపిస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

నేడు పెదకాకానిలో శాకంబరీ ఉత్సవాలు

పెదకాకాని: ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లు, సుగంధ ద్రవ్యాలతో శాకంబరీదేవిగా ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి డి.శ్రీరామవరప్రసాదరావు శనివారం తెలిపారు. ముఖ మండపం, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారంతో పాటు సోమవారం కూడా భ్రమరాంబ అమ్మవారు శాకంబరీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకోవడం కోసం అవకాశం ఉందని ఉప కమిషనర్ తెలిపారు. ఆదివారం భక్తులకు అమ్మవారి దివ్య ప్రసాదంగా కదంబం వితరణ చేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు

ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

గుంటూరుఎడ్యుకేషన్: విద్యార్థులకు అంటువ్యాధులు ప్రబలకుండా పాఠశాలల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో శనివారం గుంటూరు నగర పరిధిలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలను మలేరియా, డెంగీ తదితర అంటువ్యాధులపై అప్రమత్తం చేస్తూ విద్యాశాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగీ వంటి అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించాలని పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. డీఈవో పి.శైలజ, జిల్లా ఎస్‌సీడీ ఇన్‌చార్జి శ్రావణ్‌బాబులు మాట్లాడారు. సమావేశంలో జిల్లా మలేరియా నియంత్రణాధికారి సుబ్బారాయణం, డీవైఈవో పి.వెంకటేశ్వరరావు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

కష్టాల కలనేత

- వానలతో నేతన్నలకు అవస్థలు
- మగ్గాల్లోకి చేరిన నీరు
- తేమ వాతావరణంతో ముందుకు కదలని నేత
- కుటుంబ పోషణ భారం
- వర్షాకాల భృతి అమలుచేయాలని వేడుకోలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం




భట్టిప్రోలు మండలం ఐలవరంలో వర్షాలకు ఎత్తివేసిన చేనేత మగ్గం దోనె

భట్టిప్రోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో చేనేత వాడల్లో మగ్గాల సవ్వడి మూగబోయింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చేనేత చతికిలపడింది. కార్మికులు ఉపాధి కోల్పోయారు. మగ్గం ఆడితే గానీ డొక్కాడని బతుకులతో అవస్థలు పడుతున్నాయి. వర్షాలకు మగ్గాల గుంతల్లోకి నీరు చేరింది. దీంతో చేనేత అనుబంధ పనులు కూడా స్తంభించి పోయాయి. నేతన్నలు పనుల్లేక దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. నేత కార్మికులతో పాటు నూలు, పడుగు, మరాసు తదితర ఉప వృత్తులు చేసే వారు కూడా ఉన్నారు. మగ్గాల్లోకి నీరు చేరడంతో నేత నేసే అవకాశం లేకపోయింది. చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారింది.

మూగబోయిన మగ్గాల సవ్వడి

భట్టిప్రోలు మండలంలో అద్దేపల్లి, ఐలవరం, భట్టిప్రోలు, కోనేటిపురం ప్రాంతాల్లో 500 మగ్గాలు నడుస్తున్నాయి. సుమారు వెయ్యి కుటుంబాలు చేనేత పరిశ్రమనే నమ్ముకుని జీవిస్తున్నాయి. ప్రతి చేనేత మగ్గంపై 10 మంది అనుబంధ కార్మికులు పని చేస్తారు. ఎక్కువ శాతం గుంత మగ్గాలు కావడం వల్ల నేతకు వాతావరణం అనుకూలించదు. స్టాండ్ మగ్గాలైతే కొంతమేర ఫర్వాలేదు. పనులు లేకపోవడంతో చేనేత కార్మికులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. మగ్గాల్లో నేత దిగినప్పటికీ మొల కట్టుకునేందుకు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో అయోమయ స్థితిలో ఉన్నారు. చేనేత పనికి వర్షాకాలం, చలికాలాల్లో పరిస్థితులు అనుకూలంగా ఉండవు. మగ్గాలపై నేత అలాగే ఉంటే పాడైపోతుందని కార్మికులు వాపోతున్నారు. సాధారణంగా పొడి వాతావరణం ఉంటేనే మగ్గం ముందుకు కదులుతుంది. ముసురు వల్ల పని లేక చేనేత కార్మికులు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



భట్టిప్రోలులో మగ్గం గుంతలోకి చేరిన నీటిని తోడుతున్న నేతన్న

కరువు భత్యం ఇవ్వాలి



2019కి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేత కార్మికులకు ఏడాదిలో రెండు నెలలు నెలకు రూ. 4వేలు చొప్పున కరువు భత్యం ఇస్తామని హామీ ఇచ్చారు. దీన్ని ఇప్పటికైనా అమలు చేస్తే బాగుంటుంది. ఈ ప్రతికూల వాతావరణంలో నాణ్యమైన వస్త్రోత్పత్తి చేయలేకపోతున్నాం.మగ్గాల్లో నీరు బయటకు పోయేందుకు కొద్ది రోజులు పడుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు బియ్యం పంపిణీతో పాటు ఆర్థిక సాయం చేయాలి.

–ఎం. సత్యనారాయణ, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు

పనుల్లేక అవస్థలు



వేట విరామ సమయంలో మత్స్యకార భరోసా అమలు చేసిన విధంగానే నేతన్నలకు కూడా సహాయం అందిస్తే బాగుంటుంది. వర్షాలకు మగ్గాల్లోకి నీరు చేరడంతో పనుల్లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో రెండు నెలల పాటు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలి. కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలకు రూ. 5వేలు చొప్పున ప్రభుత్వం అందించాలి.

– జి. బాలాజీ, ఏపీ చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు

లోతట్టు ప్రాంతాలు జలమయం



రేపల్లె 23వ వార్డులో నిలిచిన వర్షపునీరు

రేపల్లె రూరల్: అల్పపీడన ప్రభావంతో గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. పట్టణంలోని పలు మురికి వాడలు, రహదారులపై నీరు చేరడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని 22, 23, 28, 1, 2, 3వ వార్డులతో పాటు నిజాంపట్నం రోడ్డు, పాతస్టేట్ బ్యాంక్ రోడ్డుల్లో వర్షపు నీరు నిలిచి, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల రహదారులు లోతట్టుగా ఉండటంతో పాటు డ్రైయిన్లు లేకపోవడంతో వర్షపు నీరు పాదరుల లేకుండా పోయింది. దుర్గంధం వెదజల్లుతోంది. నీటి పారుదలకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొల్లూరులో అత్యధికంగా 22.8 మి.మీ.వర్షపాతం

బాపట్ల : బాపట్ల జిల్లాలో శనివారం అత్యధిక వర్షపాతం కొల్లూరు మండలంలో 22.8మి.మీ. నమోదు కాగా అత్యల్పంగా వేటపాలెంలో 3.2మి.మీ పడింది. జిల్లాలో టి.చుండూరులో 17.8, అమృతలూరులో 17.4, వేమూరు 7.2,కొల్లూరులో 22.8, భట్టిప్రోలులో 10.6, చెరుకుపల్లిలో 10, పిట్టలవానిపాలెంలో 8.8, కర్లపాలెంలో 10.8, బాపట్లలో 16.4 ,నిజాంపట్నంలో 7.2, నగరం 9.2, రేపల్లె 9.6, సంతమాగులూరు 5.8, బల్లికురవ 8.2, మార్టూరు 8.4, యద్దనపూడి 7.6, పర్చూరు 6.4, కారంచేడు 7.2, ఇంకొల్లు 4.6, జె.పంగులూరు .4.2, అద్దంకి 6.4, కొరిశపాడు 4.2, చీరాల 6.4, వేటపాలెం 3.2, చినగంజాం 4.4 మీ.మీ వర్షపాతం నమోదైంది.

వర్షానికి కూలిన ఇల్లు

మార్టూరు: గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి వలపర్లలో ఓ ఇంటి పైకప్పు కూలిపోయింది. దీంతో బాధితులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో జరిగింది. స్థానిక ముస్లిం కాలనీకి చెందిన రిజ్వానా కళ్లులేని వృద్ధురాలు. శుక్రవారం రాత్రి కుమార్తె రహంతున్నీసా, ఆమె ఇద్దరు పిల్లలతో ఇంటిలో నిద్రిస్తున్నారు. వర్షానికి ఇంటి మట్టి గోడ తడిసి కూలిపోయింది. అదృష్టవశాత్తు వీరు పడుకున్న ప్రదేశంలో ఇల్లు కూలకపోవడంతో ప్రమాదం నుంచి బయటపడినట్లు బాధితులు వాపోయారు. ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగోలేని, తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



వలపర్లలో కూలిన ఇల్లు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



ఏరియా వైద్యశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ జె. వెంకట మురళి సిబ్బందికి చెప్పారు. బాపట్లలోని ప్రాంతీయ వైద్యశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. బెడ్ల సామర్థ్యం, ప్రతిరోజు నమోదయ్యే ఓపీ, ఆసుపత్రిలో చేరుతున్న వారి సంఖ్య, అత్యవసర విభాగంలో సేవలు, ఆపరేషన్లు, ఔషధాల నిల్వల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో స్వయంగా మాట్లాడారు. వైద్య సేవల గురించి ఆరా తీశారు. తమ వెంట వచ్చిన వారు వేచి ఉండడానికి సౌకర్యం లేదని పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చిన వారంతా ఆరోగ్యవంతులై తిరిగి వెళ్లడమే లక్ష్యంగా డాక్టర్లు పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన వైద్యం సకాలంలో అందించాలని సూచించారు. వైద్యశాలలపై నిరంతరం వైద్యాధికారుల పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రిలో రక్తం నిల్వలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పించాలని చెప్పారు. రోగుల వెంట వచ్చిన వారు వేచి ఉండడానికి అవసరమైన షెడ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిధులు సమీకరించి తక్షణమే చర్యలు తీసుకుంటామని, లేనిపక్షంలో దాతల సహాయంతో సత్వరమే ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. ప్రాంతీయ వైద్యశాలలో మంచి వైద్య సేవలు అందుతున్నాయని, ప్రజలంతా వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ ఆకస్మిక పర్యటనను తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, ఏపీవీపీ కోఆర్డినేటర్ డాక్టర్ శేషు కుమార్ అక్కడకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై చైతన్యవంతుల్ని చేయాలి

సీనియర్ సివిల్ జడ్జి ఎల్.వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్ వినియోగించే విధంగా న్యాయవాదులు చైతన్యపరిచే బాధ్యతలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎల్.వెంకటేశ్వర్లు తెలిపారు. హెల్మెట్ వినియోగంపై సబ్ కోర్టు హాలులో న్యాయవాదులకు శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రయాణ సమయంలో అనుకోకుండా జరిగే ప్రమాదాల నుంచి హెల్మెట్ కాపాడుతుందని చెప్పారు. వాహనం నుంచి కింద పడిన సమయంలో ఎక్కువగా తలకు తగిలిన గాయాలతోనే మృత్యువాత పడినట్లు గణాంకాలు చెబుతున్నాయని చెప్పారు.



న్యాయవాదులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి వెంకటేశ్వర్లు

సత్ప్రవర్తనతో జీవించాలి

ఖైదీలు సత్ప్రవర్తనతో శాంతియుత జీవితాన్ని అవలంబించి, సన్మార్గంలో నడవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు చెప్పారు. పట్టణంలోని సబ్ జైలులో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రిమాండ్ ఖైదీలకు శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలకు జీవితకాలం బాధలు పడటంతో పాటు కుటుంబ సభ్యులు కూడా అవస్థలు పడాల్సిన పరిస్థితులు ఉంటాయని తెలిపారు. పగలు, ప్రతీకారాలు, రాగద్వేషాల్ని వీడి శాంతికాముకులుగా జీవించాలని ఆయన సూచించారు. వివిధ చట్టాలు, పడే శిక్షల గురించి వివరించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ, సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సముద్రంలో తిరగబడిన ఫైబర్ బోటు

- ప్రాణాలతో బయటపడ్డ ముగ్గురు మత్స్యకారులు
- మత్స్య సంపద, వేట సామగ్రి నీటిపాలు



ఒడ్డుకు చేర్చిన బోటు వద్ద మత్స్యకారులు

నిజాంపట్నం: సముద్రంలో ఫైబర్ బోటు తిరగబడి మత్స్యసంపద, వలలు నీటిపాలు కాగా ముగ్గురు మత్స్యకారులు ప్రాణాలతో బయటపడ్డ సంఘటన నిజాంపట్నంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. చిప్పల వీర్రాజుకు చెందిన ఫైబర్ బోటులో నిజాంపట్నానికి చెందిన పురమా సోమయ్య, మోపిదేవి కేశవులు కలసి ఈ నెల 17న హార్బర్ నుంచి వేటకు బయలుదేరి వెళ్లారు. ముగ్గురూ మూడు రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, మత్స్య సంపదను భద్రపరుచుకునేందుకు ఐస్, ఉప్పు తదితక సామగ్రిని తీసుకువెళ్లారు. రెండు రోజులు సముద్రంలో వేట చేసుకుని, పడిన మత్స్య సంపదను భద్రపరుచుకున్నారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో శుక్రవారం రాత్రి వేట నుంచి ఒడ్డుకు బయలుదేరి వస్తున్నారు. హార్బర్ సమీపంలోని మొగ వద్ద సముద్రంలో అలల తాకిడికి ఫైబర్ బోటు ఒక్కసారిగా తిరగబడింది. అందులో ఉన్న ముగ్గురూ పెద్దపెద్ద కేకలు వేస్తూ ప్రాణాల్ని కాపాడుకునేందుకు సముద్రంలో ఈత వేస్తుండగా, అటుగా వెళుతున్న పెద్దబోటులోని కొందరు కాపాడారు. తిరగబడిన ఫైబర్ బోటుకు తాడు కట్టి ఒడ్డుకు లాక్కొచ్చారు. బోటులోని మత్స్యసంపదతో పాటు వేట సామగ్రి మొత్తం నీటిపాలై పోయాయి. బతుకు జీవుడా అంటూ ముగ్గురు మత్స్యకారులు ప్రాణాలతో బయటపడ్డారు. జరిగిన సంఘటన వివరాలను స్థానిక మత్స్యశాఖ అధికారులకు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.1.50లక్షల నష్టం వాటిల్లడంతో బోటు ఓనర్ చిప్పల వీర్రాజు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నాడు.

వరదలొస్తే అనుక్షణం అప్రమత్తత

- పరీవాహక ప్రాంతాల్లో సిబ్బందికి ఎస్పీ సూచన
- లోతట్టు ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండాలి
- లంక గ్రామాల్లో పర్యటన



పెనుమూడి వంతెనపై నుంచి పరీవాహక ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్పీ

బాపట్ల టౌన్: కృష్ణా నది పరీవాహక ప్రాంతాలకు ఎగువ నుంచి వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున లంక గ్రామాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. కృష్ణా నది పరీవాహక ప్రాంతాలైన లంక గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రవహిస్తున్న నీటిని పెనుమూడి వంతెన ప్రాంతంలో పరిశీలించారు. లోతట్టు ప్రదేశాల పరిస్థితుల గురించి స్థానిక అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేపల్లె డీఎస్పీ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. తీర ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజ్ నుంచి నీటిని కిందకి విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణానది పరీవాహక ప్రాంతాలైన లంక గ్రామాలకు వరద నీరు అధికంగా చేరే అవకాశం ఉందన్నారు. వరద ముంపు సంభవించే పరిస్థితి ఏర్పడితే ప్రజల్ని వెంటనే సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొని, ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. వరద ముంపునకు గురవడానికి అవకాశం ఉన్న ప్రదేశాల్లో నివాసం ఉండే ప్రజలు ప్రభుత్వం సూచించిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ఆయన సూచించారు. బ్రిడ్జిలు, కల్వర్టులపై వరద నీరు ప్రవహిస్తుంటే వాటిని దాటి వెళ్లే ప్రయత్నం చేయరాదని తెలిపారు. పోలీసుల తక్షణ సహాయం కోసం డయల్ 100, 112కి లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమావేశంలో రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, రేపల్లె పట్టణ సీఐ ఎస్కే నజీర్ బేగ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరీదేవి.. శరణు శరణు





విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శాకంబరీదేవి ఉత్సవాలు శనివారం రెండో రోజు వైభవంగా జరిగాయి. ఉపాలయాల్లో కొలువై ఉన్న దేవతామూర్తులకు సైతం కూరగాయలతో అలంకరించారు. కూరగాయలతో తయారు చేసిన కదంబం ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు బారులు తీరి కనిపించారు.

– ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

జాయింట్ కలెక్టర్ బి. సుబ్బారావు



పాతనందాయపాలెం(కర్లపాలెం): గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని బాపట్ల జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. ఆయన శనివారం పాతనందాయపాలెం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు, మరణాల వివరాల్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందే విధంగా కృషి చేయాలని చెప్పారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలానందబాబా ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో శివనాగరాజు, కార్యదర్శి మురళి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో చోరీకి యత్నం

- నలుగురు యువకుల్లో ముగ్గురు పరార్
- ఒకరు స్టేషన్‌కు తరలింపు

పెదపులివర్రు(భట్టిప్రోలు): బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో దొంగతనం చేసేందుకు వచ్చిన యువకుల్లో ఒకరిని స్థానికులు చాకచక్యంతో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. భట్టిప్రోలు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భట్టిప్రోలు మండలం పెదపులివర్రు బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శనివారం చోరీ చేసేందుకు తెనాలి నుంచి ఆటోలో నలుగురు యువకులు యత్నించారు. ఆఫీసు తాళాలు ఇవ్వమని, తాము చెక్ చేసేందుకు వచ్చామని చెప్పారు. అనుమానం వచ్చిన యజమాని రేపల్లె ఆఫీసుకు ఫోన్ చేయగా వచ్చిన వారు తమ వారు కాదని చెప్పడంతో అప్రమత్తమయ్యారు. స్థానికులు వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా ముగ్గురు పరారయ్యారు. ఒక యువకుడిని పట్టుకుని ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆఫీసులోకి ఎందుకు వెళ్లారనే విషయంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. సమాచారాన్ని వేమూరు సీఐ పి. రామకృష్ణకు తెలియజేశారు. ఆటోలో గోతాలు, ఇనుప కడ్డీలు ఉన్నట్లు గుర్తించారు. ఆఫీసు తాళాలు ఎక్కడ ఉంటాయో తెలిసిన వాళ్లే ఈ చోరీకి పాల్పడినట్లు

పిట్టగోడ పైనుంచి పడి వ్యక్తి మృతి



రేపల్లె రూరల్: ప్రమాదవశాత్తు డాబా పిట్టగోడ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని రింగు రోడ్డులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని 5వ వార్డుకు చెందిన ఉమామహేశ్వరరావు (59) రింగు రోడ్డు సెంటరులో దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం వర్షం పడుతుండటంతో దుకాణంపై పట్టా కప్పేందుకు పిట్టగోడ ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, ఉమామహేశ్వరరావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని పట్టణ ఎస్ఐ హరిబాబు తెలిపారు.

నూతన విద్యా వారోత్సవాల సందడి

- రేపటి నుంచి 'శిక్షా సప్తాహ్' పేరిట వారం రోజుల పాటు పలు కార్యక్రమాలు
- జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి
- మార్గదర్శకాలు జారీ చేసిన సమగ్ర శిక్షా శాఖ
- జిల్లాలోని 1834 పాఠశాలల్లో కార్యక్రమ నిర్వహణ
- విద్యార్థులను చైతన్య పర్చడమే లక్ష్యం



ఉపాధ్యాయులకు మొక్కలు పంపిణీ చేస్తున్న సమగ్ర శిక్షా అధికారులు

బాపట్ల టౌన్: కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఈపీ) 2020లో ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి రాష్ట్రంలోనూ అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రమం తప్పకుండా నాలుగేళ్లుగా రాష్ట్ర సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో అమలు చేసింది. ఈ కార్యక్రమం ప్రస్తుతం నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 22 నుంచి 29వ తేదీ వరకు వారం రోజుల పాటు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ (విద్యా వారం)ని ర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపై, దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధతను తెలియజేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. అప్పటి వరకు ఉన్న 10+2+3 విద్యా విధానం బదులు డాక్టర్ కృష్ణస్వామి కస్తూర్తి రంగన్ సిఫార్సుల మేరకు నూతన జాతీయ విద్యా విధానం రూపకల్పన జరిగింది. ఈఎస్ఈ-2020లో భాగంగా 5+3+3+4 పాఠశాల విధానాన్ని ప్రవేశపెట్టారు. దీన్ని 2020 జూలై 29న కేంద్రం ఆమోదించింది. దీంతో నూతన విద్యా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లే లక్ష్యంతో కేంద్రం ఆదేశాల మేరకు శిక్షా సప్తాహ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో తల్లిదండ్రులు, స్థానికుల భాగస్వామ్యం కావాలని జిల్లా విద్యాశాఖ. జారీ చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

కార్యక్రమాలు జరిగేది ఇలా..

22న స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన,23న పునాది అభ్యసన కార్యక్రమం, 24న క్రీడా దినోత్సవం , 25న సాంస్కృతిక దినోత్సవం, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం , 27న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం, 29న సామాజిక భాగస్వామ్య దినోత్సవం నిర్వహించాలి.

ప్రతి పాఠశాలలో నిర్వహించాలి



జిల్లాలోని 25 మండలాలు, నాలుగు మున్సిపాల్టీల పరిధిలో మొత్తం 1834 పాఠశాలలు ఉన్నాయి. ఇప్పటికే ఈ కార్యక్రమం నిర్వహణపై జిల్లాలోని డెప్యూటీ డీఈవోలు, ఎంఈవో, సమగ్రశిక్ష అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రతి పాఠశాలలో జరిగే కార్యక్రమాల ఫోటోలు తీసి వాటిని డాక్యుమెంటేషన్ తయారుచేయాలని సూచించాం. శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో పక్కాగా నిర్వహిస్తాం.

–జి. వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి డీఈవో, బాపట్ల జిల్లా

మార్గదర్శకాల ప్రకారం నడుచుకుంటాం



రాష్ట్ర సమగ్ర శిక్షా అధికారులు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పాఠశాలల్లో తప్పనిసరిగా శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తాం. కార్యక్రమ నిర్వహణ, అమలు పరిచే విధివిధానాల గురించి క్షేత్రస్థాయిలోని సమగ్ర శిక్షా సిబ్బందికి వివరించాం. కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరం కృషి చేస్తాం.

ఎం. వెంకటసుధాకర్, సమగ్ర శిక్షా ఏపీసీ

ప్రజల చేతిలో పాశుపతాస్త్రం స.హ. చట్టం

జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ

మార్టూరు: ప్రభుత్వ యంత్రాంగాన్ని గాడిలో పెట్టడంతో పాటు అన్ని శాఖలపై సామాన్యుడికి సైతం అవగాహన కల్పించడం కోసం సమాచార హక్కు చట్టాన్ని రూపొందించారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై. రామకృష్ణ అన్నారు. ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్ ఆదేశాలతో స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం సమాచార హక్కు చట్టం -2005పై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ప్రకారం దేశ పౌరులందరికీ ఏ ప్రభుత్వ కార్యాలయం నుంచైనా రాతపూర్వకంగా సమాచారం అడిగి తెలుసుకునే హక్కు ఉందని తెలిపారు. ఉద్యోగులు తప్పకుండా చట్టంపై అవగాహన కలిగి పౌరులు అడిగిన సమాచారాన్ని 30 రోజుల్లోగా రిజిస్టర్ పోస్టు ద్వారా తెలియజేయాలని చెప్పారు. మార్టూరు ఏడీఏ కె.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పౌరులు తమ కార్యాలయ పరిధిలో లేని సమాచారాన్ని దరఖాస్తు చేసి ఉంటే ఉద్యోగులు దాన్ని సంబంధిత శాఖకు పంపించి విషయాన్ని అర్జీదారులకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. దేశ భద్రత తదితర అంశాలు, ఉద్యోగులు లేదా వ్యక్తుల వ్యక్తిగత సమాచారం గురించి దరఖాస్తు చేసి ఉంటే సెక్షన్-8 ద్వారా ఇవ్వకూడదనే విషయాన్ని దరఖాస్తుదారుడికి తెలియజేయాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార అధికారి పేరు తెలుపుతూ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు.

ఉపాధి నిధులతో మూగజీవాలకు షెడ్లు

- లబ్ధిదారుల ఎంపికకు ఆదేశాలు
- పశుసంవర్ధకశాఖ సన్నద్ధం



ఎం. హనుమంతరావు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

బాపట్ల టౌన్: ఉపాధి హామీ పథక నిధులతో మూగజీవాల షెడ్ల నిర్మాణాలకు అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి ఎం. హనుమంతరావు తెలిపారు. ఆయన శనివారం వివరాలను విలేకరులకు వెల్లడించారు. జిల్లాలోని తీర ప్రాంతాల్లోని మండలాలకు పశువుల షెడ్లు 300, మెరక ప్రాంతాల్లోని మండలాలకు 475 చొప్పున మొత్తం 775 నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. మేకలు, గొర్రెలు, కోళ్ల పెంచేందుకు కోస్తామండలాలకు 50, మెరక ప్రాంతంలోని మండలాలకు 25 చొప్పున మొత్తం 75 నిర్మించనున్నట్లు తెలిపారు. వీటి నిర్మాణానికి ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారులతోపాటు దారిద్ర్యరేఖకు దిగువన ఉండి తెల్లరేషన్ కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరు అర్హులని పేర్కొన్నారు. పశువుల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక చేస్తారని వెల్లడించారు.

షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ ఇలా ..

షెడ్డు	యూనిట్ ధర	సబ్సిడీ	రైతు వాటా
పశువులకు..			
రెండు పశువులకు	రూ.1,15,000	రూ.1,03,500	రూ. 11,500
నాలుగు పశువులకు	రూ.1,85,000	రూ.1,66,500	రూ. 18,500
ఆరు దాటితే	రూ.2,30,000	రూ.2,07,500	రూ.23,000
గొర్రెలు, మేకలు, కోళ్లకు ..			
షెడ్లు	యూనిట్ ధర	సబ్సిడీ	రైతు వాటా
20 గొర్రెలు, మేకలు	రూ.1,30,000	రూ.91,000	రూ.39,000
50 గొర్రెలు,మేకలు	రూ. 2,30,000	రూ.1,61,000	రూ.69,000
100 కోళ్లు	రూ.87,000	రూ.60,900	రూ.26,100
200 కోళ్లు	రూ.1,32,000	రూ.92,000	రూ.39,600

కార్యకర్తలు అధైర్యపడొద్దు.. నేనున్నా!

అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి తెలిపారు. ఆయన శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. టీడీపీ అధికారం చేపట్టిన రోజు నుంచి ప్రజలకు శాంతిభద్రతలు కరువయ్యాయని విమర్శించారు. దారుణ హత్యకు గురైన రషీద్ కుటుంబ సభ్యుల్ని పరామర్శించడానికి శుక్రవారం వినుకొండ వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి దారి పొడువునా వర్షాన్ని కూడా లెక్క చేయకుండా అధిక సంఖ్యలో ప్రజలు స్వాగతం పలికారన్నారు. పర్యటనను విజయవంతం చేసినందుకు ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని గోవాడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నరిశెట్టి పెద్ద వీరయ్యను చిన హనిమిరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థకు కేంద్ర బిందువు విద్యార్థి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

జే.పంగులూరు: విద్యా వ్యవస్థ మొత్తానికి కేంద్ర బిందువు విద్యార్థి అని శాసన మండలి సభ్యుడు కె.ఎస్. లక్ష్మణరావు అన్నారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో 550 మార్కులు పైన పొందిన విద్యార్థులకు శనివారం అభినందన సభ నిర్వహించారు. పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు విద్యార్థులు పాఠశాలకు వస్తేనే ఉపాధ్యాయులు, ఎంఈవోలు, డీఈఓలు, ఇతర ఉన్నతాధికారులు అవసరం ఉంటుందన్నారు. విద్యార్థులే లేకపోతే వీళ్లంతా అవసరం లేదని తెలిపారు. విద్యార్థుల్ని పాఠశాలకు తీసుకు రావాల్సిన బాధ్యత ఈ ఉద్యోగులంతా తీసుకుంటే, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు పుష్కలంగా ఉంటారని ఆయన తెలిపారు.

రావినూతల ఆదర్శం

రావినూతల గ్రామంలో 35 ఏళ్ల క్రితం పత్తి రైతులు నష్టాలతో ఆత్మహత్య చేసుకున్నారని, తరువాత పిల్లలు చదివించుకోవడంపై ఆసక్తి చూపడం వల్ల ప్రస్తుతం ఆ గ్రామానికి చెందిన 100 కుటుంబాలు పైనే విదేశాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నాయని లక్ష్మణరావు తెలిపారు. మండలంలో ప్రైవేటు పాఠశాలలు లేకపోవడానికి ఉపాధ్యాయుల సమష్టి కృషే కారణమని పేర్కొన్నారు. ఆస్ట్రేలియాకు చెందిన మోటివేషనల్ స్పీకర్ నిక్‌వుజినిక్ గురించి చందలూరు పాఠశాలకు చెందిన గొట్టిపాటి చంద్రిక అనే విద్యార్థిని ద్వారా సభలో చెప్పించారు. అనంతరం లక్ష్మణరావు తల్లిదండ్రుల పేరుతో ఉన్న కేవీఆర్ అండ్ విజయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా ట్రిపుల్ ఐటీ, ఎన్ఎంఎంఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు ఇంగ్లిష్ డిక్షనరీలు, రూ.1000 నగదు, రాజ్యాంగ పుస్తకాలను బహూకరించారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు టి.వి.నరసింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కె.నాగభూషణం, జి. వీరాంజనేయులు, హెచ్ఎంలు కొప్పోలు రమాదేవి, స్వయంపు గోవిందరాజులు, ఇమ్మడిశెట్టి అనిత, చందలూరి గిరిజ, కె. బంగారుకొండ, హనుమంతరావు, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, నాగాలాండ్ రిటైర్డ్ ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

శవ దహనానికి కర్రల తరలింపు అడ్డగింత

- అధికారులు వెళ్లినా ఫలితం లేక మరో మార్గంలో తరలింపు
- వేలూమూరిపాడులోని ధేనువకొండ పునరావాస కాలనీలో ఘటన



అధికారుల కోసం ఎదురుచూస్తున్న ధేనువకొండ కాలనీవాసులు

అద్దంకి: మృతురాలి శవ దహనానికి ఉపయోగించే కట్టెలను తమ రహదారి నుంచి తరలించడానికి వీల్లేదని ఓ కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ ఘటన బాపట్ల జిల్లాలోని అద్దంకి మండలంలోని వేలమూరిపాడు ఎస్సీ కాలనీలో శనివారం జరిగింది. ధేనుకొండ పునరావాస కాలనీవాసులు రామిరెడ్డి ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ధేనువకొండ గ్రామ (గుండ్లకమ్మ డ్యామ్) పునరావాసులకు వేలమూరిపాడు గ్రామ సమీపంలో కాలనీ కేటాయించారు. అందులో వారు ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారు. కాలనీలో మృతి చెందిన వారి అంత్యక్రియలు చేయడానికి శ్మశానం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. తీరా అధికారులు దూరంగా వేలమూరిపాడు ఎస్సీ కాలనీకి దిగువ ప్రాంతమైన గుండ్లకమ్మ నదీ పరీవాహక ప్రాంతంలో శ్మశానానికి స్థలాన్ని కేటాయించారు. దీనికి వేమూరిపాడు ఎస్సీ కాలనీలోని రహదారి నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కాలనీలోని రామిరెడ్డి పెద అంజమ్మ (85) శనివారం మృతి చెందగా కర్రల్ని వేలమూరిపాడు ఎస్సీ కాలనీ రహదారి నుంచి తరలిస్తున్న క్రమంలో నివాసితులు అడ్డుకున్నారు. తమకు అశుభం అంటూ అడ్డు చెప్పారు. సమస్యను స్థానిక తహసీల్దారు సుభానీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వీఆర్వోతో అక్కడ వెళ్లి సర్ది చెప్పబోయినా ససేమిరా అన్నారు. చేసేది లేక దూరంగా ఉండే మరో మార్గాన్ని ఎంచుకుని అటునుంచి కర్రల్ని తరలించారు. ధేనుకొండ పునరావాస కాలనీకి రహదారి సమస్యను త్వరలో పరిష్కరిస్తానని, వేరే మార్గాన్ని కేటాయిస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు.